వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత

- పెద్దపొర్లలో 210 మంది విద్యార్థులకు ముగ్గురే ఉపాధ్యాయులు
- విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోని అధికారులు



పెద్దపొర్ల పాఠశాల భవనం



పెద్దపోర్ల పాఠశాలలో తరగతి గది లో పాఠాలను భోదిస్తున్న ఉపాధ్యాయురాలు

ఊట్కూర్ : మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలను ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. దీంతో విద్యా సంవత్సరం ముగింపు దశకు వచ్చినా ఆయా సబ్జెక్టులలోని పాఠ్యాంశాలు పూర్తయ్యే అవకాశం లేకుండా పోతోంది. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. వార్షిక పరీక్షలు దగ్గర పడుతున్న వేళ ఏం చేయాలో తోచక అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మండలంలోని పెద్దపొర్లలో పరిస్థితి దారుణంగా ఉంది. పాఠశాలలో ఉర్దూ మీడియానికి సంబంధించి 9 మంది విద్యార్థులు చదువుతుండగా ఒక ఉపాధ్యాయురాలు పనిచేస్తోంది. కాగా తెలుగు మీడియంకు సంబంధించి మొత్తం అయిదు తరగతులలో కలిపి 210 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి పాఠాలు బోధించడానికి కేవలం నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. అందులోనూ ఒకరు డిప్యూటేషన్‌పై వేరే మండలానికి వెళ్లారు. దీంతో ముగ్గురితోనే నెట్టుకొస్తున్నారు. ఒక్కోసారి రెండు తరగతుల చొప్పున ఒకే దగ్గర కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నారు. తద్వారా విద్యార్థులకు సమస్యలు తప్పడం లేదు. ఇదిలా ఉంటే పెద్దపొర్ల పంచాయతీలో ఆమ్లేట్ గ్రామంగా ఉన్న జీర్లహళ్లిలో ఏకంగా పాఠశాలనే మూతపడింది. ఆ గ్రామానికి చెందిన విద్యార్థులు పెద్దపొర్లలో చదువుతున్నారు. దీంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తొలిమెట్టు కార్యక్రమం నీరుగారిపోతోంది. కాగా విద్యార్థులు చదువులో వెనుకబడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కరించండి



పాఠశాలలో విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు చదువులో వెనుకబడుతున్నారు. 5 తరగతులలో 210 మందికి గానూ ముగ్గురు ఉపాధ్యాయులే విధులు నిర్వహిస్తున్నారు. రెండు తరగతులను ఒకే దగ్గర కూర్చోబెట్టి చదువు చెప్పుతున్నారు. అధికారులు స్పందించి ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులు ఇబ్బందులు పడకుండా చూడాలి.

–అంజప్ప, పెద్దపొర్ల

వెంటనే నియమించాలి

పాఠశాలలో 5 తరగతుల్లో 210 విద్యార్థులు ఉన్నారు. నిబంధనల ప్రకారం 30 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండాల్సి ఉండగా కేవలం ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. దీంతో పాఠశాలలో తొలిమెట్టు కార్యక్రమం పటిష్టంగా అమలు కావడం లేదు. ఉన్నతాధికారులు పాఠశాలని సందర్శించి ఉపాధ్యాయులను నియమించాలి.

–మహ్మద్ యూసుఫ్, పెద్దపొర్ల

మార్మోగిన శివ నామస్మరణ



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

నారాయణపేట రూరల్ : పట్టణంలోని పళ్ల ఏరియాలోని పరిమళాపురంలో శివ శివనామస్మరణ మార్మోగింది. ఈ మేరకు బీకేఎస్ నాయకులు అనంత్‌రెడ్డి, గాయకులు ప్రభాకర్‌రెడ్డి ఇంట్లో సోమవారం వైభవంగా శివపూజ నిర్వహించారు. శివమాలాధారుల ఆధ్వర్యంలో స్వామివారి విగ్రహానికి పంచామృతాభిషేకం, బిల్వార్చన, పుష్పాలంకరణ, మహామంగళహారతి కార్యక్రమాలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. భక్తిపాటలు, భజనలు చేశారు. అనంతరం 500మంది స్వాములకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో గురుస్వాములు, వివిధ పార్టీల నాయకులు, పట్టణ వాసులు పాల్గొన్నారు.

హామీలను నిలబెట్టుకోవాలి



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

నారాయణపేట రూరల్ : భాషా పండితులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ దగ్గర నిరసన వ్యక్తం చేసి కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2017 ప్రపంచ తెలుగు మహాసభలో పండిత్‌లను స్కూల్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేస్తామని సీఎం కేసీఆర్ మాట ఇచ్చారని, ఐదేళ్లు గడిచినా కార్యరూపం దాల్చలేదన్నారు. తమను అప్‌గ్రేడ్ చేసిన తర్వాతనే బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. రాములు, యశ్వంత్, విభీషణ్, లక్ష్మీకాంత్, సత్యనారాయణ, శ్రీనివాస్, చంద్రశేఖర్, బాలాజీ, శ్రీకాంత్, రమాదేవి, రేఖ, ఉమామహేశ్వరీ, సునీత, హేమ పాల్గొన్నారు.

శిలాఫలకాలు పెట్టడమే అభివృద్ధా ?



సమావేశంలో మాట్లాడుతున్న నామాజీ

నారాయణపేట రూరల్ : పనులు చేయకపోయినా శిలాఫలకాలు పెట్టడమే అభివృద్ధిగా చెబుతూ బీఆర్ఎస్ సర్కారు ముందుకు పోతుందని బీజేపీ రాష్ట్ర నాయకులు నాగురావునామాజీ విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దళితులు, మైనార్టీలకు ఇచ్చిన స్థలాలు, ఇళ్లను లాక్కోని అభివృద్ధి పేరిట వారిని రోడ్డున పడేశారన్నారు. రెండున్నరేళ్లలో సెక్రెటేరియట్ నిర్మించారని, పేదల కోసం 8 ఏళ్లలో డబుల్ బెడ్‌రూమ్‌లు ఎందుకు పూర్తికావడం లేదన్నారు. మినీ స్టేడియం నిర్మిస్తామని గొప్పలు చెప్పిన మంత్రి నేడు అదే స్థలంలో సమావేశం నిర్వహించడం సిగ్గుచేటన్నారు. పాలమూర్-రంగారెడ్డితో ఒరిగేది ఏమీలేదని, వెంటనే జీఓ 69ని అమలు చేసి పేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టాలన్నారు. చిన్నపిల్లల దవఖానా పేరుతో ప్రైవేటు కాంట్రాక్టర్‌కు ఆర్టీసీ పాత బస్టాండ్ స్థలాన్ని అప్పనంగా కట్టబెట్టడం సరికాదన్నారు. డిగ్రీ కళాశాలకు చెందిన స్థలంలో ప్రైవేటు పాఠశాల నడపటం ఎంత వరకు సమంజసమేని, విచారణ చేయించాలన్నారు. సమీకృత మార్కెట్‌లో సైతం అవకతవకలు ఉన్నాయని, నూతనంగా నిర్మిస్తున్న కలెక్టరేట్, ఎస్పీ భవనానికి సంబంధించిన డీపీఆర్ విడుదల చేయాలన్నారు. గతంలో వేసిన శిలాఫలకాలకు సంబంధించి పనులు ప్రారంభం కాకుండానే తిరిగి కేటీఆర్ జిల్లా పర్యటనకు రావడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సమావేశంలో పీ.శ్రీనివాసులు, ప్రభాకరవర్దన్, వెంకట్రాములు, రఘువర్‌యాదవ్, రఘురామయ్యగౌడ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

దరఖాస్తు చేసుకోండి

కోస్గి: పాలిటెక్నిక్ చదివేందుకు నిర్వహించే ప్రవేశ పరీక్షల షెడ్యూల్ విడుదలైనట్లు స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ పరమేశ్వరీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు నేరుగా పాలిసెట్ రాసి ఇంజనీరింగ్ విద్యను చదవ వచ్చని, ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ప్రక్రియ ఈ నెల 16న మొదలైందని ఫిబ్రవరి 28 వరకు కొనసాగుతుందని, జనరల్, బీసీ విద్యార్థులు రూ.500, ఎస్సీ, ఎస్టీలు రూ.250 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హత పరీక్ష మే 17న ఉంటుందన్నారు.

'బహిరంగసభకు తరలిరండి'

ధన్వాడ: జిల్లా కేంద్రానికి మంగళవారం మంత్రి కేటీఆర్ రానున్న నేపథ్యంలో నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు రాజవర్ధన్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. యువజన సంఘం మండల అధ్యక్షులు సునిల్, సింగిల్ విండో వైస్‌చైర్మన్ గండిబాల్‌రాజు, ఎంపీటీసీ సుధీర్ కుమార్ రావు, కొండారెడ్డి పాల్గొన్నారు.

దామరగిద్ద: జిల్లా కేంద్రానికి మంత్రి కేటీఆర్ రానున్న నేపథ్యంలో నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు ఆశన్న ఎంపీపీ నర్సప్పలు అన్నారు. సభకు తరలివెళ్లే మండల ప్రజలకు మద్దెల్‌బీడ్ స్టాప్ సమీపంతో భోజన సదుపాయం ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి, జిల్లా రైతు సమితి సభ్యులు వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా ఆత్మార్పణ దినోత్సవం



మరికల్: మండల కేంద్రంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో సోమవారం భక్తులు ఘనంగా వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు రమేష్, పాండు, లక్ష్మి ప్రసాద్, శ్రీనివాస్, నాగరాజ్‌లు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

దామరగిద్ద: మండల కేంద్రమైన దామరగిద్దలో వెలసిన కన్యక పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్‌శెట్టి, శేఖరయ్య, బాల వెంకటరమణ, విశ్రాంత ఉపాధ్యాయులు శ్రీనివాస్, ప్రభాకర్‌వర్ధన్, రాజశేఖర్, శశిధర్, మహిళ భక్తులు పాల్గొన్నారు.

అంబేద్కర్ చిత్రపటాన్ని తప్పకుండా ఉంచాలి



మాగనూర్: రాబోవు గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జెండా ఆవిష్కరణ చేసే ప్రతిచోట అంబేద్కర్ చిత్రపటాన్ని తప్పకుండా ఉంచాలని అంబేద్కర్ యువజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ అమీర్‌కు ఈ మేరకు వినతపత్రం అందజేశారు. నాయకులు మహేష్, రాఘవేంద్ర, అర్జున్ , వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పేట- కొడంగల్ ఎత్తిపోతల చేపట్టాలి

దామరగిద్ద: గత ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన పేట – కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టి రైతులకు సాగునీటిని అందించాలని టీడీపీ పార్లమెంటరీ కమిటీ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాములుయాదవ్ అన్నారు. మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్రానికి వస్తున్న మంత్రి కేటీఆర్ జీఓ 69 ను అమలు చేసేలా హామీ ఇవ్వాలన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పేరుతో ఈ పథకాన్ని మరుగున పడేశారన్నారు. పాలమూరు రంగారెడ్డి పథకంలో జిల్లాలోని దామరగిద్ద మద్దూర్, కోస్గి, కొడంగల్ వంటి ప్రాంతాలకు సాగు నీరు వచ్చే పరిస్థితి లేదన్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

కృష్ణా: ఎదురుగా అతివేగంగా వస్తున్న కారును తప్పించబోయి ద్విచక్రవాహనంపై నుంచి పడి ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. రాయ్‌చూర్ వైపు నుంచి సైదాపూర్ గ్రామానికి చెందిన సిద్ధప్ప, సోమప్పలు ద్విచక్రవాహనం పై హిందుపూర్, టైరోడ్డు మధ్యకు రాగానే గుల్బర్గా నుంచి రాయ్‌చూర్ వైపు వెళ్తున్న ఓ కారు ఎదురుగా వచ్చింది. కారు అతివేగంగా వస్తున్న నేపథ్యంలో దానిని తప్పించబోయి ద్విచక్రవాహనంపై ఉన్న ఇద్దరు కిందపడ్డారు. ఈ క్రమంలో కారు సైతం అదుపు తప్పి పడిపోయింది. కాగా ద్విచక్రవాహనంపై ఉన్న సిద్ధప్ప సోమప్పలకు త్రీవంగా గాయాలయ్యాయి. దీంతో వారిని రాయచూర్‌లోని రిమ్స్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కారులో ఉన్న వారికి మాత్రం ఎలాంటి గాయాలు కాలేదు. ఈ ఘటనకు సంబంధించి నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయభాస్కర్ తెలిపారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



గుడిగండ్లలో మెటీరియల్స్ అందజేస్తున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి

మక్తల్: పదోతరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలన్న లక్ష్యంతో ఉచితంగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్నామని వీజేఆర్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. మక్తల్ మండలం గుడిగండ్ల గ్రామంలో సోమవారం మెటీరియల్స్ పంపిణీ చేశారు. నియోజకవర్గంలో ప్రతి పాఠశాలలోని విద్యార్థులకు మెటీరియల్స్ అందిచేందుకు కృషిచేస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకుని పరీక్షలలో ప్రతిభ కనబరచాలని సూచించారు. మెటీరియల్ కోసం 8367266777 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. మెటీరియల్ ఇవ్వడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు వర్కటంను అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణయ్య, రియాజ్, చంద్రశేఖర్, శ్రీలత ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ పత్రం అందజేత



మాగనూర్: మండల పరిధిలోని బైరంపల్లి గ్రామ నూతన గౌడ కల్లుగీత కార్మికుల సంఘం నూతనంగా ఏర్పాటు కావడంతో సోమవారం స్థానిక ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సంఘం లైసెన్స్ పత్రంను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎల్లారెడ్డి, కల్లుగీత సంఘం నాయకులు ప్రభాకర్‌గౌడ్, మల్లగౌడ్, అంజనేయులుగౌడ్, చిన్నమారెప్ప, బస్వరాజు, సైదేష్ తదితరులు పాల్గొన్నారు.

'దాడి చేయడం సరికాదు'



మక్తల్: నిజామబాద్ జిల్లా కోటగిరిలో దళిత ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌పై దాడి చేయడం సరికాదంటూ స్వేచ్ఛా జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మానవహారం చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. డీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి సూర్యచంద్ర, అధ్యక్షురాలు హైమావతి, ఆయా సంఘాల నాయకులు వెంకటస్వామి, భాస్కర్, చంద్రశేఖర్, భగవంతు, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

నారాయణపేట రూరల్ : ఉపాధ్యాయులు, హేతువాదులు, భౌతికవాదులు, నాస్తికులపై మతోన్మాద దుండగులు చేసిన దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు టీపీటీఎఫ్, డీటీఎఫ్, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా, ఐఎఫ్‌టీయూ, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూల నాయకులు తెలిపారు. సోమవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆందోళన చేపట్టారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ... రాజ్యాంగం ద్వారా భావ ప్రకటన స్వేచ్ఛను కల్పించారని, మతోన్మాద శక్తులు అప్రజాస్వామికంగా దాడులు చేయడం సరికాదన్నారు. ఈశ్వర్, ప్రశాంత్, నారాయణ, మాధవ్, తాయప్ప, ఎల్లగౌడ్, సాయికుమార్, సౌజన్య, నర్సింహా, భారతమ్మ, వెంకటేష్, నరహరి, రవికిరణ్ పాల్గొన్నారు.

నేడు మార్కండేయ స్వామి జయంతి



ముస్తాబైన ఆలయం

నారాయణపేట టౌన్ : భక్త మార్కండేశ్వర స్వామి జయంతి వేడుకలను మంగళవారం నిర్వహిస్తున్నట్లు పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్ష కార్యదర్శులు క్యాతన్‌రఘునాథ్, సాంబరి శ్రీనివాసులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని సుభాష్ రోడ్‌లో వెలసిన శ్రీ భక్త మార్కండేయ స్వామి ఆలయంలో ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. స్వామికి పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం ఉంటాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

నేతాజీ సేవలు చిరస్మరణీయం



నారాయణపేటలో నేతాజీ విగ్రహానికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి


- ఘనంగా జయంతి వేడుకలు
- నివాళులు అర్పించిన ప్రజాప్రతినిధులు, నాయకులు, విద్యార్థులు

నారాయణపేట రూరల్ : నేటి యువత నేతాజీ సుభాష్ చంద్రబోస్ వంటి దేశ భక్తులుగా ఎదగాలని ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సుభాష్‌రోడ్డులో సోమవారం ప్రతిష్ఠించిన నేతాజీ నూతన విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు, యువతకు నేతాజీ ఎంతో ఆదర్శణీయుడని, ప్రతి ఒక్కరు ఆయన ఆశయ సాధనకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో గందె చంద్రకాంత్, చెన్నారెడ్డి, కృష్ణకోర్‌వర్ పాల్గొన్నారు. అదేవిధంగా బీజేపీ , కాంగ్రెస్, టీడీపీ నాయకులు సుభాస్‌చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేశారు. ఏబీవీపీ, ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నాయకులు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా దేశ స్వాతంత్ర్య సమరంలో ఆయన సేవలను కొనియాడారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం దగ్గర తపస్ ఆధ్వర్యంలో పరాక్రమ దివాస్ నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. శేర్‌కృష్ణారెడ్డి, బాలరాజు, విశ్వనాథ్‌రెడ్డి, చిన్ననర్సింహులు, అంబర్‌నాథ్, సురేష్, తిరుపతయ్య, నర్మద, రాఘవులు పాల్గొన్నారు.


మక్తల్: పట్టణంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. 500 మంది విద్యార్థులతో జాతీయ పతకాన్ని పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి వంశీ, అధ్యక్షులు అంజిరెడ్డి, నగర ఉపాధ్యక్షుడు వినయ్, సురేష్, నితిన్, నర్సింహ, అనిల్, రాజు, జగదీష్, పాల్గొన్నారు.

ధన్వాడ: మండల కేంద్రంలోని శ్రీచైతన్య విద్యామందిర్ పాఠశాలలో సోమవారం సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రిన్సిపల్ కాశయ్య, చంద్రకాంత్, భారత్, రవి, రమాదేవి, సరిత, అనసూయ, అంజలి విద్యార్థులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని నిడుగుర్తి ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం సుభాష్‌చంద్రబోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రధానోపాధ్యాయులు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాటంలో బోస్ ఎనలేని సేవలు అందించారని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, పద్మ,, సలాం, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



మక్తల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, విద్యార్థులు



ధన్వాడలో సుభాస్ చంద్రబోస్‌కు నివాళి అర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

చెక్కు అందజేత

కృష్ణా: మండంలోని తంగిడి గ్రామానికి చెందిన అంజుకు మంజూరైన రూ. 60 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును సోమవారం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అందించారు. ఈ సందర్భంగా పలువురు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలియజేశారు. తంగిడి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సీఐటీయూలో చేరికలు

మక్తల్: పట్టణంలో కార్మిక సంఘం నాయకులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఖుట్బో, మున్సిపల్ యూనియన్ జిల్లా మాజీ అధ్యక్షుడు కర్రెం కృష్ణలతో పాటు 30 కార్మికులు సీఐటీయూలో చేరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి సమక్షంలో కార్యక్రమం జరిగింది. నాయకులు జోషీ, గోవింద్ రాజ్, రాంరెడ్డి, రమేష్, జిందప్ప తదితరులు పాల్గొన్నారు.

'మంత్రిని అడ్డుకుంటాం '

నారాయణపేట రూరల్ : గిరిజన ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మంత్రులు పర్యటనలకు రావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బంజారా గిరిజన విద్యార్థి సమైక్య రాష్ట్ర ఇన్‌చార్జ్ సంతోష్‌రాథోడ్ అన్నారు. బుధవారం నారాయణపేటకు వస్తున్న కేటీఆర్‌ను అడ్డుకుంటామన్నారు. ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఫిబ్రవరి 15న సేవాలాల్ జయంతికి అధికారికంగా సెలవు ఇవ్వాలని, బాలబాలికలకు వేర్వేరుగా వసతి గృహాలను ఏర్పాటుచేయాలని, గిరిజన బంధు విడుదల చేయాలని తదితర డిమాండ్‌లను ప్రకటనలో పేర్కొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

నర్వ: మండలంలోని యాంకి, లంకాల్ గ్రామంలో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. లంకాల్‌లో నర్సింహస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. సర్పంచ్ వెంకటేష్, డైరెక్టర్ లింగన్న, జనార్ధన్‌రెడ్డి, స్థానిక నాయకులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మెనూ పాటించాలి

నర్వ: మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈఓ లక్ష్మీనారాయణ సూచించారు. సోమవారం నర్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. మన ఊరు- మన బడి పనులను పర్యవేక్షించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. హెచ్ఎం మల్లేష్, సీఆర్పీలు నర్సిములు, రోజా తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో ఊరేగింపు

అమరచింత: పట్టణంలో వెలసిన జములేశ్వరి దేవత ఉత్సవాలను పురస్కరించుకొని అమ్మవారి పట్టు వస్త్రాలను సోమవారం భక్తిశ్రద్ధలతో మేళతాళాలతో ఆలయానికి తీసుకొచ్చారు. ప్రతి ఏడాది జములమ్మ దేవత ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి పట్టుచీరతో పాటు అమ్మవారి నగలను ఆలయానికి తరలించడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ. పట్టణంలోని భక్త మార్కండేయ ఆలయం నుంచి అమ్మవారి పట్టు చీర, వెండి ఆభరాలను జములేశ్వరి మాత ఆలయానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. చిన్నారుల కోలాటాలతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ ఆలయానికి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం నుంచి నెల రోజుల పాటు అమ్మవారి ఉత్సవాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు మంగలి నరసింహులు, నాయకులు మేర్వరాజు, కృష్ణారెడ్డి, క్యామ భాస్కర్, సత్యనారాయణ, హన్మంత్‌రెడ్డి, పారుపల్లి శ్రీను, విష్ణు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



నారాయణపేట: తెలంగాణ పంచాయితీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నారాయణపేట జిల్లా ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్‌ను జడ్పీచైర్‌పర్సన్ వనజ సోమవారం ఆవిష్కరించారు. జడ్పీ సీఈఓ జ్యోతి, పీఆర్ ఈఈ నరేందర్, జిల్లా అధ్యక్షులు రాంచందర్‌రావు, ప్రధాన కార్యదర్శి రమేశ్‌కుమార్, పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటా రూ.7,502

నారాయణపేట: వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం వేరుశనగ క్వింటాల్ గరిష్టంగా రూ.7,502, కనిష్టంగా రూ.4,730 పలికింది. వడ్లు హంస కనిష్టంగా రూ.1,909, సోనా గరిష్టంగా రూ.2,369, కనిష్టంగా రూ.2,309 పలికగా తెల్లకందులు గరిష్టంగా రూ.8,290, కనిష్టంగా రూ.7,609, ఎర్రకందులు గరిష్టంగా రూ.8,003, కనిష్టంగా రూ.6,621 పలికాయి. జిల్లాలోని కాటన్‌మిల్లుల్లో పత్తి క్వింటా గరిష్టంగా రూ.8,050, కనిష్టంగా రూ.5వేలు పలికింది.